నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | RAJANNA SIRCILLA

## రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా?



కేసీఆర్ తండా శివారులో కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

ఇక్కడ సగం కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డు మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండా శివారులోనిది. గతంలో కురిసిన భారీ వర్షాలకు సైడ్‌బర్మ్ కొట్టుకుపోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రోడ్డు పక్కన మట్టి పోయించారు. అయితే, ఇటీవలి భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ఇలా ఉంటే ప్రయాణం ఎలా సాగుతుందని, అధికారులు సిమెంట్ లైనింగ్‌తో రోడ్డు పక్కన మరమ్మతు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 5

## ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 5 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఫలితాలు విడుదల చేసినట్టు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ , www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

## విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేయద్దు



కరీంనగర్: విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

ముకరంపుర, అక్టోబర్ 5: ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేయవద్దని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. విద్యుత్ విషయంలో ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కరీంనగర్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జనరేటింగ్ స్టేషన్లన్నీ లాభాల్లో ఉన్నాయని, మంచి పీక్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో నడుస్తున్నాయని తెలిపారు. ఇలాంటి స్టేషన్లను ఇతరులకు అప్పగించి విద్యుత్ సంస్థలను, అందులో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తును ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించి ముందుకు సాగితే ధర్నాలు, నిరాహార దీక్షలు, సమ్మెకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘు, భాస్కర్, శ్రీనివాస్, సంపత్ కుమార్, స్వామి, సుధీర్, కిరణ్, శ్రీనివాస్, రఘుపతి, జనార్దన్, ఉద్యోగులు పాల్గొన్నారు.



## చంద్రఘంట అలంకారంలో అమ్మవారు

వేములవాడ టౌన్, అక్టోబర్ 5: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజు శనివారం నాగిరెడ్డి మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారిని పెద్దసేవపై ఊరేగించారు.


# 2008 డీఎస్సీ జాబితాలో అక్రమాలు

మంత్రివర్గ ఉపసంఘంలో ఉన్న మంత్రుల ఇలాకాలోనే నిబంధనలకు పాతర

- కొత్తగా 25 మందికి అవకాశం
- గత జాబితాలో ఉన్న 13 మంది పేర్లు గల్లంతు
- నిలదీయడంతో ఐదుగురి పేర్లు యాడ్
- ఇంకా ఎనిమిది మందికి అన్యాయం
- అభ్యర్థుల జీవితాలతో ఆటలు
- అధికారుల తీరుపై ఆరోపణలు
- డీఈవో పొంతన లేని సమాధానం
- విచారణ జరిపితే అక్రమాలు బహిర్గతం అవుతాయంటున్న అభ్యర్థులు

**ఎన్నో ఏండ్ల నిరీక్షణ, పోరాటం తర్వాత ఉద్యోగాలు సాధించుకున్న 2008 డీఎస్సీ అభ్యర్థులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వానికి పంపిన జాబితాలో తాజాగా అధికారులు భారీ అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ డీఎస్సీకి సంబంధించి ఫలితాలు 2010 లోనే వెలువడగా, ఆనాడు వెల్లడించిన మెరిట్ లిస్ట్‌లోని 13 మంది పేర్లు ప్రస్తుతం గల్లంతయ్యాయి. దీనిపై విద్యాశాఖాధికారులను ప్రశ్నిస్తే.. ఆగమేఘాల మీద అందులో నుంచి ఐదుగురి పేర్లు జాబితాలో చేర్చి, మరో ఎనిమిది మందికి చేయిచ్చారు. ఇంకోవైపు ఆనాటి జాబితాలో లేని 25 మందికి కొత్తగా అవకాశం కల్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఆనాడు లేని ఆ 25 మంది పేర్లు ఇప్పుడెలా వచ్చాయి? అందులో మతలబు ఏమిటి? దీని వెనుక నడిచిన వ్యవహారం ఏమిటన్న దానిపై అనేక సందేహాలు ఉత్పన్నమవుతుండగా, విచారణ జరిపితే మొత్తం అక్రమాలు బహిర్గతం అవుతాయన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి పొంతన లేని సమాధానాలు చెప్పడం మరిన్ని అనుమానాలు, అపోహలకు దారి తీస్తున్నది.**

కరీంనగర్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కమాన్ చౌరస్తా : 2008లో ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఆ సమయంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో అన్ని పోస్టులకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులంటూ స్పష్టంగా పేర్కొంది. ఆ తర్వాత నోటిఫికేషన్‌కు భిన్నంగా జీవో నంబర్ 28ను జారీ చేసి, అందులో ప్యాట్రన్ మార్చింది. 70 శాతం పోస్టులను కామన్‌గా పేర్కొంటూ, 30 శాతం పోస్టులకు మాత్రం డీఈడీ చేసిన వాళ్లు మాత్రమే అర్హులని చెప్పింది. దీని ద్వారా తమకు అన్యాయం జరుగుతుందని భావించిన బీఈడీ అభ్యర్థులు, అప్పుడే కోర్టును ఆశ్రయించారు. ఆ పరిస్థితుల్లోనే ప్రభుత్వం 2010 జూన్‌లో నోటిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాల వారీగా మెరిట్ జాబితా ప్రకటించింది. దాని ప్రకారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 965 మంది అభ్యర్థుల పేర్లతో డీఎస్సీ కామన్ మెరిట్ జాబితా ఇచ్చింది. కానీ, మళ్లీ నియామకాల సమయంలో మాత్రం జీవో నంబర్ 28లోని నిబంధనలను అమలు చేసింది. దీంతో మెరిట్ జాబితాలో ఉండి కూడా తమకు ఉద్యోగం రాకపోవడానికి గల కారణాలను వివరిస్తూ.. బీఈడీ అభ్యర్థులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. అంతేకాదు, నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నింబంధనలనే పరిగణలోకి తీసుకొని, తమకు నియామకాలు చేపట్టాలని ఇన్నాళ్లు పోరాటం చేస్తూ వచ్చారు.




### ఫలించిన పోరాటం

దాదాపు పదహారేండ్లుగా ఉద్యోగాల కోసం చేసిన పోరాటం ఫలించింది. 2008లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికై, ప్రభుత్వం ప్యాట్రన్ మార్చడం వల్ల నష్టోయిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని ఇటీవల కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. కమిటీకి మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షుడిగా, మన ఉమ్మడి జిల్లా మంత్రు లు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా వ్యవహరించారు. కమిటీ పూర్తి అధ్యయనం చేసిన తర్వాత 2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ప్రస్తుతం ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవోలు) ఆనాటి మెరిట్ జాబితాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం చూస్తే.. నోటిఫికేషన్ జా రీ సమయంలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఆనాడు అంటే 2010లో ప్రకటించిన మెరిట్ జాబితాను అధికారులు ప్రభుత్వానికి పంపించాలి.

### అంతా గోల్‌మాల్?

తాజా, పరిణామాలను చూస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు పంపిన జాబితా తప్పుల తడకగా ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఆనాడు ప్రకటించిన మెరిట్ లిస్ట్ ప్రకారం చూస్తే ఇంకా 228 మంది బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ, తాజాగా, అధికారులు మొదటి జాబితాలో 186 మంది పేర్లు, రెండో జాబితాలో 14 మంది పేర్లు ప్రభుత్వానికి పంపించారు. ఈ రెండు జాబితాల్లో కలిపి 200 మంది పేర్లు ఉన్నాయి. ఇక్కడే అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిజానికి రెండుసార్లు పంపిన జాబితా కలిపి చూస్తే.. 2010లో ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉన్న 13 మంది పేర్లు గల్లంతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అభ్యర్థులు వచ్చి రెండు రోజుల పాటు డీఈవో కార్యాలయం ఎదుట పడిగాపులుపడి ఆందోళన చేస్తే.. అందులో నుంచి ఐదుగురు అభ్యర్థులను తిరిగి జాబితాలో చేర్చారు. ఇంకా ఎనిమిది మందికి మాత్రం అవకాశం కల్పించడం లేదు. ఈ 13 మంది మెరిట్ జాబితా ప్రకారమే కాదు, 2016లో సమాచార హక్కు చట్టం కింద సేకరించిన డీఎస్సీ జాబితాలోనూ ఉన్నారు. ఇప్పుడు న్యాయబద్ధంగా రావాల్సిన ఎనిమిది మంది అభ్యర్థుల గురించి ప్రశ్నిస్తే తమకు తెలియదన్నట్టు అధికారులు భిన్నరకాల వాదనలు వినిపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. 2010లో ప్రకటించిన మెరిట్ లిస్ట్, అలాగే 2016లో సమాచార హక్కు చట్టం కింద తీసుకున్న జాబితాలో లేని 25 మంది కొత్త అభ్యర్థుల పేర్లను ప్రభుత్వానికి జిల్లా విద్యాధికారులు పంపించారు. ఆనాడు మెరిట్ జాబితాలో లేని పేర్లు ఈరోజు జాబితాలోకి ఎలా వచ్చాయన్న దానికి అధికారులు వింత వాదనలు వినిపిస్తున్నారు. దీనిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై లోతైన విచారణ జరిగితే ఈ అక్రమాలన్నీ బహిర్గతం అవుతాయన్న డిమాండ్లు వస్తున్నాయి. అంతేకాదు, రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని సమస్య ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోనే ఎందుకు వస్తుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అందులోనూ మంత్రి వర్గ ఉపసంఘంలో మన ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్న ఇలాకాలోనే ఇటువంటి పరిణామాలు చోటుచేసుకోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై లోతైన విచారణ జరిపితే అర్హులకు జరిగిన అన్యాయంతోపాటు అక్రమాలు బహిర్గతం అవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ కోణంలో చూసినా ఆనాటి మెరిట్ జాబితాకు.. ప్రస్తుతం ప్రభుత్వానికి అధికారులు పంపిన వివరాలకు పొంతన కనిపించడం లేదు. అంతా గోల్‌మాల్ గోవిందం అన్నట్టుగానే ఉన్నది.

### డీఈవో పొంతన లేని సమాధానాలు

మెరిట్ జాబితాలో అభ్యంతరాలు, అదనంగా చేరిన 25 మంది అభ్యర్థుల విషయంలో 'నమస్తే తెలంగాణ' డీఈవోను ప్రశ్నించగా, కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. అప్పుడు పంపిన మెరిట్ జాబితా తప్పుల తడకగా ఉండగా, తాము దాన్ని సరిచేసి పంపామని చెబుతున్నారు. ఈ విషయంలో అప్పటి అధికారులు తప్పు చేశారా? అని ఆయనను ప్రశ్నించగా, అప్పుడు నేను డీఈవోగా లేనందున సమాధానం చెప్పలేనని అంటున్నారు. మరి నష్టపోయిన అభ్యర్థులు మెరిట్ జాబితాలో ఉన్నారని, డీఈవో దృష్టికి తీసుకుపోగా, వారి కంటే మెరిట్ ఉన్న అభ్యర్థులను గుర్తించి ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు.




## మిల్లర్స్ అసోసియేషన్ ముడుపులపై
# కదులుతున్న డొంక?

- వ్యవహారంపై కలెక్టర్ సీరియస్
- అసోసియేషన్‌కు నోటీస్ జారీ చేసిన అడిషనల్ కలెక్టర్
- వివరణ ఇవ్వాలంటూ అల్టిమేటం
- తప్పుడు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నాలు
- నిజాలు చెప్పి తీరాల్సిందే నంటున్న ఈసీ సభ్యులు
- బయటకు వస్తున్న మరిన్ని కొత్త వసూళ్ల కోణాలు
- 'నమస్తే తెలంగాణ' కథనాలకు స్పందన

**కరీంనగర్ మిల్లర్స్ అసోసియేషన్‌లో అక్రమాలు ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయి. ఇప్పటికే 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు సంచలనం రేపగా, వివిధ కారణాలు చూపుతూ మిల్లర్ల నుంచి వసూళ్లకు పాల్పడడం, అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చినట్టు చూపడం, దీనిపై ఈసీ సభ్యులు నిలదీయడం, ఇవ్వకుండానే ఇచ్చినట్టు లెక్కలు వేయడం.. వంటి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అయితే, అధికారులకు ముడుపుల వ్యవహారంపై కలెక్టర్ పమేల సత్పతి సీరియస్ అయినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, దీనిపై నిగ్గు తేల్చాలన్న నిర్ణయానికి వచ్చి, నమ్మకమైన అధికారవర్గాల ద్వారా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. మరోవైపు పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ మిల్లర్స్ అసోసియేషన్‌కు తాజాగా నోటీసు ఇచ్చారు. పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని అల్టిమేటం జారీ చేశారు. దీంతో ముడుపుల బాగోతాన్ని కప్పిపుచ్చడంతో పాటు పక్కదారి పట్టించేందుకు కొంత మంది అసోసియేషన్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై వివరణ ఇచ్చేందుకు కలిసి రావాలని కొంతమంది ఈసీ సభ్యులను, మిల్లర్లను కోరగా.. వారు నిరాకరించడమే కాదు, వాస్తవాలు బయటకు రావాల్సిందేనని నిక్కచ్చిగా చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుండగా, ప్రస్తుతం నోటీస్ వ్యవహారం మిల్లర్లలో చర్చనీయాంశమవుతున్నది.**

కరీంనగర్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో ఇటీవలి కాలంలో జరుగుతున్న అక్రమాలపై స్వయంగా మిల్లర్లే భగ్గుమంటున్నారు. వివిధ కారణాలు చూపుతూ వసూలు చేస్తున్న డబ్బులను స్వయంగా కొంత మంది వెనకేసుకుంటున్న తీరు వెలుగులోకి వస్తుండడంతో మండిపడుతున్నారు. మిల్లర్లకు అండగా నిలువాల్సిన అసోసియేషనే పక్కదారి పడితే.. తప్పుడు పద్ధతుల్లో ముందుకెళ్తే ఎలా..? అని ప్రశ్నిస్తున్నారు.

### అక్రమాలు బహిర్గతం

రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో జరిగిన అక్రమాలు, బైలాకు విరుద్ధంగా చేసిన ఖర్చులు, అధికారులకు ముడుపులు, ఈసీ సమావేశంలో నిలదీసిన సభ్యులు, ఆ మేరకు సమాధానం చెప్పలేక బెదిరింపులు.. ఇలా అనేక అంశాలను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. గత నెల 28న 'రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో ₹2 కోట్ల గోల్‌మాల్?'.. అలాగే 29న 'రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నుంచి అధికారులకు భారీ ముడుపులు?'.. 30న 'అధికారుల పేరుతో హాంఫట్?'.. శీర్షికన ప్రచురించిన కథనాలు సంచలనం రేపాయి. ఉమ్మడి జిల్లా మిల్లర్లలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఇటీవలి ఈసీ మీటింగ్‌లో వివిధ అంశాలతోపాటు అధికారులకు ముడుపుల విషయంపై జోరుగా చర్చ జరిగింది. అందులో ఒక ఉన్నతాధికారికి ₹15 లక్షలు ఇచ్చినట్టు నాయకులు చెప్పడం.. అది ఓసారి ₹5 లక్షలు, మరోసారి ₹10 లక్షలు ఇచ్చినట్టుగా చెప్పడంతో ఈసీ సభ్యులు ఫైర్ అయిన విషయం తెలిసిందే. వీరితోపాటు పౌరసరఫరాల విభాగానికి చెందిన మరో ఇద్దరు ఉన్నతాధికారులకు ఒక్కొక్కరికి ₹10 లక్షల చొప్పున ఇచ్చినట్టు లెక్కలు చూపడం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇది బహిర్గతం కావడంతో ఏకంగా సదరు అధికారులు అవాక్కయ్యారు. తమకు పైసా ఇవ్వకుండా తమ పేరిట ఇన్ని డబ్బులు లెక్కల్లో చూపడం ఏమిటని కొంత మంది మిల్లర్లకు ఫోన్ చేసి ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, ఇదే ఈ విషయాన్ని స్వయంగా ఒక అధికారి ఈసీ సభ్యులకు ఫోన్ చేసి వివరించినట్టు తెలిసింది.

### నిజాలు నిగ్గు తేలాల్సిందే

అదనపు కలెక్టర్ నోటీస్‌తో ఆగమవుతున్న అసోసియేషన్ ఇప్పుడు దానిని ఎలాగైనా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే ఒక మిల్లర్ రంగంలోకి దిగి ఈసీ సభ్యులతో మాట్లాడుతున్నట్టు తెలుస్తున్నది. ఈ ముడుపుల వ్యవహారం ఏమీ లేదని చెప్పేందుకు ముందుకు రావాలని సదరు సభ్యులను కోరడమే కాకుండా.. లిఖిత పూర్వక వివరణకు మీరంతా సంతకాలు పెట్టాలని కోరినట్టు సమాచారం. అయితే, ఈ విషయంలో నిగ్గు తేలాల్సిందేనని సదరు ఈసీ సభ్యులు తేల్చిచెబుతున్నారు. వక్రమార్గాలు, పక్కదారుల్లో వచ్చి తమను ప్రలోభాలకు గురిచేసినా.. లేదా బెదిరింపులకు పాల్పడినా.. తామే తమ వద్ద ఉన్న ఆధారాలను, వాయిస్ రికార్డులను తీసుకెళ్లి ఉన్నతాధికారులకు ఇస్తామని ఓ ఈసీ సభ్యుడు తెగేసి చెప్పినట్లుగా తెలుస్తున్నది. ఒక వేళ ముడుపులు ఇచ్చింది నిజమే అయితే.. ఇచ్చినట్టుగానే వివరణ రాసి పంపిద్దామని కొంత మంది మిల్లర్లు సూచనలు చేసినట్టు సమాచారం. ఒకవేళ ఇవ్వకపోతే ఆ డబ్బులన్నీ ఏమయ్యాయో..? లెక్కలు ముందుగా ఈసీ కమిటీకి చెప్పాలని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. ఇవేకాదు, వివిధ ఖర్చుల పేరిట ఇచ్చినట్టు చూపుతున్న లెక్కలు, చందాల పేరిట రాసి చూపుతున్న వ్యవహారాలు మొత్తం బయటకు రావాల్సిందేనంటూ పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది. మిల్లర్లు రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చితే చందాలు, ముడుపుల పేరిట వసూలు చేసిన లెక్కలను చెప్పకపోతే ఎలా? అని సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే.. మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. రా రైస్ మిల్లుల్లో కొన్ని డిఫాల్ట్ ఉన్నాయని గత యాసంగిలో సీఎంఆర్ కేటాయింపు చేయాలని ఓ అధికారి తెగేసి చెబితే.. ఆ సాకును చూపి కొంత మంది రా రైస్ మిల్లర్ల వద్ద కూడా డబ్బులు వసూలు చేసి సదరు అధికారికి ఇచ్చినట్టు చూపడం మిల్లర్లలో పెద్ద చర్చ నడుస్తున్నది. దీనికి సంబంధించి మరింత స్పష్టమైన సమాచారం అందాల్సి ఉండగా.. అతి త్వరలోనే రా రైస్‌మిల్లు పేరిట కొంత మంది సాగించిన వసూళ్ల పర్వం కూడా బయటకు వచ్చే అవకాశమున్నది. ప్రధానంగా అసోసియేషన్‌లో తీగ లాగితే డొంకంతా కదులుతున్నది. నిజానికి మెజార్టీ మిల్లర్లు నిబంధనలకు లోబడి పనిచేసుకుంటున్నారు. సీఎంఆర్ నుంచి మొదలు కొని.. ఇతర ప్రతి విషయంలోనూ నిబంధనలను అతిక్రమించకుండా మిల్లులను నడుపుతున్నారు. అయితే, కొంత మంది చేసిన అక్రమాలు, ఆగడాలను కప్పి పుచ్చేందుకు అసోసియేషన్ అన్ని మిల్లుల నుంచి డబ్బులు వసూలు చేసి.. వాటిని అధికారులు, ఇతరులకు ఇచ్చినట్టు సాకు చూపి వెనకేసుకుంటున్నారన్న చర్చ ప్రస్తుతం జోరుగా సాగుతున్నది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన అసోసియేషన్ అటువంటి చర్యలు తీసుకోకపోగా.. వారికే పెద్ద పీట వేస్తూ అన్ని అర్హతలు, నిబంధనలు పాటించే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కలెక్టర్ ఆరా! నోటీస్ జారీ

అధికారులకు ముడుపుల వ్యవహారం బహిర్గతమైన తీరు ప్రస్తుతం అధికారుల్లో కలకలం రేపుతున్నది. మరోవైపు ఇవ్వని డబ్బులను ఇచ్చినట్టు రికార్డుల్లో చూపిన అసోసియేషన్ తీరుపైనా మిల్లర్లలో పెద్ద చర్చ నడుస్తున్నది. దీంతో పాటు అసోసియేషన్‌లో జరిగిన అక్రమాలు, లావాదేవీల తీరు తెన్నులను కొంత మంది మిల్లర్లు ఆధారాలతో సహా ఓ ఉన్నతాధికారికి సమర్పించినట్టు తెలుస్తున్నది. మరోవైపు ముడుపుల వ్యవహారం ప్రస్తుతం జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనూ చర్చకు దారి తీసింది. దీంతో కలెక్టర్ పమేల సత్పతి ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అక్కడితో ఆగకుండా తనకు అత్యంత నమ్మకమైన అధికారులతో ఒక వైపు వివరాలను సేకరిస్తూ, పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు మిల్లర్స్ అసోసియేషన్‌కు అడిషనల్ కలెక్టర్ నోటీస్ ఇచ్చారు. దీనిపై పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని సదరు నోటీస్‌లో స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది.



రాజు(ఫైల్)

## ఆస్తి కోసం దారుణం

- తల్లిదండ్రులతో కలిసి అన్నను హత్యచేసిన తమ్ముడు
- హుజూరాబాద్ మండలం రాజపల్లిలో ఘటన

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 5 : ఆస్తి కోసం ఓ తమ్ముడు దారుణానికి ఒడిగట్టాడు. తల్లిదండ్రులతో కలిసి అన్నను హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాజపల్లికి చెందిన నోముల ఎల్లమ్మ, చంద్రయ్యకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. అవివాహితుడైన పెద్ద కొడుకు రాజు(35) ఇంటి వద్దనే ఉంటూ తన తల్లి పేరు మీద దళితబంధులో వచ్చిన ట్రాక్టర్ నడుపుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు. చిన్న కొడుకు అంజి కొన్నేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకొని, హైదరాబాద్‌లో ఉంటూ కారు ట్యాక్సీ నడుపుకుంటున్నాడు. అయితే, తమకున్న సుమారు నాలుగెకరాల భూమిని అంజి ఎలాగైనా దక్కించుకోవాలని అనుకున్నాడు. నాలుగు రోజుల క్రితం పండుగ కోసం ఇంటికి వచ్చి, తల్లిదండ్రులతో కలిసి అన్న హత్యకు వ్యూహం పన్నాడు. శుక్రవారం రాత్రి రాజుతో గొడవకు దిగి అతడిని బలమైన ఆయుధంతో హత్య చేశారు. ఇంట్లో పడుకున్న రాజు లేవడం లేదని శనివారం ఉదయం తల్లిదండ్రులు పక్కింటివారిని పిలిచి గదిలోకి వెళ్లి చూపించగా, తీవ్ర గాయాలతో విగతజీవిగా మంచపై పడి ఉన్నాడు. మంచం కింద రక్తపు మడుగు ఉండడంతో ఎవరో హత్య చేసి ఉంటారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఏసీపీ శ్రీనివాస్, టౌన్ సీఐ తిరుమల్, ఎస్ఐ యూసఫ్‌అలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంను పిలిపించి వేలి ముద్రలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి కృపారాణి ద్వారా ఫిర్యాదు తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజూరాబాద్ దవాఖానకు తరలించారు. కాగా, మృతుడి తల్లిదండ్రులు ఎల్లమ్మ, చంద్రయ్య, సోదరుడు అంజిని అదుపులోకి తీసుకొని విచారించగా, హత్య చేసిన విషయం బయటపడిందని సీఐ తెలిపారు.

రాజన్నపేటలో వీధిలైట్లు లేక నెలకొన్న చీకటి



## అంధకారంలో రాజన్నపేట

బతుకమ్మ పండుగ పూట చీకట్లు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 5: బతుకమ్మ పండుగపూట పల్లెలు చీకట్లో మగ్గుతున్నాయి. గతంలో వీధి వీధినా లైట్లతో జిగేల్‌మన్న గ్రామాలు, కాంగ్రెస్ ప్రభుత్వంలో అంధకారంలోకి వెళ్లిపోయాయి. అందుకు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్న పేటనే నిదర్శనంగా నిలుస్తున్నది. ఎంగిలిపూల బతుకమ్మ మొదలై, సద్దుల బతుకమ్మ వస్తున్నా వీధిలైట్లు లేక రాజన్నపేటలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. బతుకమ్మ, దసరా, దీపావళి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాట్లు చూడాలని కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్‌లకు కలెక్టర్ దిశానిర్దేశం చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, చీకట్లోనే బతుకమ్మ ఆడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు మండిపడుతున్నారు.